**కథ**

# చెప్పినమాట

**◆ శివల జగన్నాథరావు ◆**

**ఒకటీ రెండూ కావు! ఏకంగా పదీ! మురిసిపోవడానికీ, మూర్ఛపోవడానికీ అవి ప్రేమలేఖలు కావు! బాధపడ్డానికీ, భారంగా నిట్టూర్చడానికీ అవి తిరిగొచ్చిన కథలు కావు!!**

మా ఇంటాయన ఇల్లు ఖాళీ చేయమనీ, పై వూర్నించీ రాసిన వుత్తరాలా? అదీ కావు!

మా రఘుపతి మవయ్య నాకు రాసిన లెటర్సవి!

ఒకో నెలలో, ఏకంగా- పదంటే పదుత్తరాలు!!

"..... శ్రీనుగాడి గురించి" నాకు ఇన్ఫర్మేషను. నేను చ్ఛాలా వర్రీ అయేంతగా ఒచ్చిందిరా, చలం! నువ్వెంటనే శ్రీను బనకి వెళ్ళు! నువ్వు "లేటు" చెయ్యకొరే! లేటు చేసేవా? తొరలోనే నా గురించీ "లేటు రఘుపతి" అని చెప్పుకోడం వింటావ్! ఆ గాడిద పరిస్తితి చూసీ, నాకు రాయేం?"- ఇది ఒక ఉత్తరం!

"మేనల్లుడు చలానికి... ఆవూర్లో వుంటోన్న నా ఫ్రెండు ఒకతను మన శ్రీనుగాణ్ణి విపరీతావస్థలో చూశాట్ట తెల్సా? అదిగో అప్పణ్ణించీ నాకు ఆందోళనగా వుంటోందో రేయ్! నాకు నా ఆఫీసుతోనే పగలూ, రాత్రీ గడిచిపోతున్నాయ్! ఎంత చాకీరి చేసినా, పని తరగని పాడు వుద్యోగం నాది! శెలవు పెడితే, వాడి శ్రాద్ధం పెట్టినట్టే (ముందుగా...) గెంతుతాడు, మా ఆఫీసరు! కాబట్టి... ఆ వూళ్ళో, మన ఫామ్లిలో, నువ్వే కాస్త ఖాళీ వున్న వాడివనీ, ఈ మావయ్య మాట వినేవాడివనీ రాస్తున్నాను! వెళ్తావుకదూ? వెళ్ళీ శ్రీను వెధవని కనిబెడతావుగదూ? వాడేవన్నా ఎదిరిస్తే, ఎగిరీ తన్ను! మరేం ఫరవాలేదు! దొంగ వెధవని కాళ్ళమీద కాల్చీ పట్టుకున్నట్టు పట్టుకో. నేను ఎలగోలా ఒచ్చేస్తాను..." ఇది మరో లెటరు!

మొదట ఎనిమిది ఉత్తరాలకీ, నేనంతగా చలించలేదు.

మావయ్యేదో పెద్దవాడు. ఏదో పెద్దాళ్ళ తాలూకు గాభరా పడిపోతున్నాడు అనుకున్నాను. వయసు పెరిగితే నిబ్బరం ఒస్తుందంటారుగాని, అనేక మందికి అది రాదు. బీపి ఒస్తుంది. బట్టతలా, బొజ్జా ఒచ్చినంత నేచురల్గా వెధవ బీపీ ఒచ్చేస్తుంది.

మా రఘుపతి మావయ్య ఎనిమిదుత్తరాలూ వుత్త బీపీ వుత్తరాలనుకున్నాను.

ఇహ- శ్రీనుబాధ ఏదో కుర్రవాడు గదా! కుర్రవయసు, కోతి సొగనూ ఒక్కలాంటిదనుకున్నాను! కాలేజీ లైఫు ఎంజాయ్ చేస్తున్నదేవో? అని సర్దుకున్నాను.

కాని మావయ్య వూరుకోలేదు. బాణాల్లా దూసుకువచ్చేయి, మరో రెండుత్తరాలు.

రఘుపతి మావయ్య, ఆయన ఏకైక తనయుడు శ్రీనివాసరావనే శ్రీనుని, మా వూర్లో, కాలేజీలో చదివిస్తున్నాడు. మావయ్య వాళ్ళూరు చిన్నది. హైస్కూలుతో ఆవూరు ఆగిపోయింది.

శ్రీనుని,, మా ఇంట్లో వుంచుకుందికి మేం ఏం అభ్యంతరం చెప్పలేదుగాని, మా ఇల్లే అభ్యంతరం చెప్పింది.

బొత్తిగా మూడే చిన గదుల ఇల్లు మాది. ఆరుగురం సభ్యులం. శుబ్భరంగా కాళ్ళు చాచుకు పడుకోలేని మా ఇబ్బందికి, శ్రీను కూడా ఎందుకు తోడు అవాలి?

అందుకే శ్రీనుని, దొరికిన చోట, దించేడు, మావయ్య.

పది ఉత్తరాలతో, నేను ఖంగారయిపోయీ, శ్రీను బనకి బయల్దేరేను.

మేం ఉండేదేమో సీతమ్మ పేట.

శ్రీను బన చెంగల్రావ్ పేట.

ఎంత దూరం అయినా వెళ్ళక తప్పదు మరి.

బావగారు బాజావాయించేస్తున్నాడు ఇన్ డైరెక్టుగా నన్ను.

కొడుకుని ఈ వూర్లో దించీ, ఇల్లు చూసి ఉంచీ-

"వీణ్ణి అప్పగిస్తున్నాను మీకు. వాడి మంచీ చెడ్డా చూడండి" అని చెప్పేడు మావయ్య.

మంచికి, అదేవిటోగానీ చలనం లేదు.

ఇప్పుడు, శ్రీను నడవడి చెడ్డగా చెప్పబడుతూంటే, మా అందర్లో సంచలనం ఒచ్చింది.

శ్రీను బనకి, బస్సుమీద వెళ్ళేను.

---

**బస్సెక్కితే పండితుడు కూడా ఫకీరు గాడైపోతాడు**

---

## కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ

బస్సులో కూడా ఫైటింగే. వీధి. కుళాయి దగ్గర ఫైటింగ్. సినీమా టిక్కట్ల దగ్గర ఫైటింగ్. సినీమాల్లో ఫైటింగ్. సంసారంలో ఫైటింగ్. శాసన సభల్లో ఫైటింగ్.

బస్సెక్కితే పండితుడు కూడా ఫకీరుగా పోతాడు.

నడుస్తున్న నరకం.

మనుషుల్ని చంపడానికి, కత్తులు, కటార్లూ, పిస్తోళ్ళూ యుద్ధాలూ అక్కర్లేదు.

మతకలహాలు, ఆస్పత్రులూ, బస్సులూ, రైళ్ళూ చాలు.

ఫామిలీ ప్లానింగు ఇవీ చేసేస్తోంటే, మళ్ళా దాని గురించీ అంత ఖర్చెందుకో? గవర్నమెంటు వెర్రిగాని.

బస్సులో చచ్చీ- బతికీ-శ్రీనుగాడింటికి వెళ్ళేను.

తలుపులు వేసే వున్నాయ్.

బస్సులో ఒళ్ళు హూనవయింది. ఇప్పుడు చేతులు హూనవయ్యేయి.

పాతికసార్లు పడా పడా పడా బాత్తేగానీ, తలుపు గడియతియ్యలేదు.

"ఎవరూ?"

అనీ, నా మొహమ్మీదికి వెధవ క్లోజప్పులో ఒచ్చీ, అడిగేడు, ఆ అబ్బాయెవడో? శ్రీనుకాదు వాడు! వాడి ఫ్రెండేవో? బ్రాందీ గప్పున వాసన కొట్టింది.

"మీరెవురో చెప్పండ్సార్, తొరగా" అన్నాడు.

"మాకర్జంటు పనుంది" ఆ గదిలోంచీ ఇంకోడు కూడా చెప్పేడు.

తలుపుకివతల నేనూ.

అవతల-గదిలో- ఆ కుర్రాళ్ళు.

ఒంగీ, తొంగీ చూసేను. ముక్కు మూస్కునీ.

బావగాడు గదిలో కనిపించలేదు.

"శ్రీను! శ్రీనివాసరావ్ కావాలి. పిలవండి" అంటూ, ఆ గది ప్రవేశం చేశేను. వాసన ఎద పగిలించింది.

"వాడు లేడండీ!" జవాబు చెప్పాడొకడు. గీరగా గిటారు వాయిస్తూ.

"అంటే? ఇంట్లోలేడా?"

"మరంతేగదండీ"

"ఇవాళాదివారం కదా?" అన్నాన్నేను.

"ఇవాళాదివారం అని, మీకు తెలియదేంటి సార్?" అని ఒకడనగానే, మరోడు గొల్లున నవ్వేడు.

"ఇవాళ కాలేజీ లేదుగదా?"

"ఆ సంగతి కూడా మీకు తెలియదేంటి సార్?" అంటూ, ఆ ఇద్దరూ పిశాచాల్లా పగలబడీ నవ్వేరు.

నాకు బీపీ ఒచ్చేస్తుందేమోననిపించింది.

"ఇవాళ ఆదివారం అయితే శ్రీనెక్కడికి దయచేసేడు నాయనా?" అనడిగేను కోపంగా.

"సార్? మీరేవురోగానీ, వుత్త బీ.సీ. (బిఫోర్ క్రయిస్ట్) కాలం వాళ్ళలా వున్నార్సార్! మేం ఇద్దరం ఏదో కాస్త గుర్రాలమీదున్నం కనుక, రూంలో పడున్నాంగానీ, శ్రీనెందుకుంటా



దరండి? అసలు వర్కింగుడేస్‌లోనే వాడుండడు!"

"ఎక్కడవుండడు? ఇంట్లోనా? కాలేజీలోనా?"

"ఎక్కడా వుండడు! కాలేజీకెళ్ళడం వాడికి మహాలేజీ!..."

"సరైతే... మరెక్కడికెళ్ళేడు?" ఆవేశన్నాపు కొంటూ, అడిగేన్నేను!

"చెప్పలేం సార్! మీ ప్రశ్నలకి సమాధానాలు ఆ వినుగు చెందని విక్రమార్కుడొచ్చి చెప్పాలి! ఆయన్ని మీరటయి అడగండి!"

వాళ్ళనింక ఎంతడిగినా లాభం లేదనుకున్నాను.

వాళ్ళని కోర్టుకెక్కించినా సరే, శ్రీనుగాడి జాడ చెప్పేట్టులేరు!!

మవయ్యేమో వుత్తరాలతో వురేసేస్తున్నాడు.

ఇంట్లో ఆ సంగతి అందరికీ చెప్పేసేను.

ఆ రాత్రి- రవుండు టేబిలు కాన్ఫరెన్స్ జరిగింది, మా ఇంట్లో.

"పోనీ, మరో మారెళ్ళి చూడ్రా! దొరకవచ్చు వాడు..." అని, రాజకీయనాయకుడి ఆశాభావం వ్యక్తపరచేడు నాన్న.

"వెళతాను! వెళ్ళడం కాదు, కొచ్చను! వాడు దొరకడం పాయింటు!" అని చెప్పేను, ముత్యాలముగ్గు డైలాగు!

శ్రీనుగాడు, మొత్తమ్మీద, మా అందరికీ, అంతర్జాతీయ సమస్య అంత అయ్యేు, కుచున్నాడు.

నేనే కాకుండా- మా అన్నయ్య- తమ్ముడు- చెల్లాయి- నాన్న- అందరం- ఎవరికి, ఎక్కడ, ఎప్పుడు, శ్రీను కనిపించితే, ఆఘళంగా, ఆ దుర్మార్గుణ్ణి (ఇప్పుడు మా అందరి దృష్టిలో వాడు ఆ పాత్రలోనే వున్నాడు గదా!) కాలరుచ్చుకు లాక్కు రావాలని, తీర్మానించుకున్నాం.

మావయ్యకి విషయాలన్నీ వివరంగా రాసిపడేసేం.

ఆఘమేఘాలమీదే వచ్చేసేడు మావయ్య.

"ఏవిట్రా ఇదంతానూ?" అని ఆర్తనాదం లాంటిది చేసేడాయన.

"అయితే, నేనా వెధవగురించీ విన్నదంతా నిజవేనన్నమాట?" అనీ, ఆక్రోశించేడు.

"ఏవిరా? నేను శ్రీనుగాణ్ణి ఒక్కణ్ణి దించితే ఆ ఇంటోకి ఇంకో ఇద్దరు గుంటవెధవలెలా ఒచ్చేరూ? ఏవిటి అన్యాయం? అయితే, వాడు అడ్డవయిన వెధవలందరికీ చోటిస్తున్నాడన్న మాట? అవునా? వుండు! కడిగిపారేస్తాను!" అంటూ ఆయన రుద్రతాండవం చేసేడు.

మావయ్యని వెంట బెట్టుకునీ, శ్రీను ఇంటికి వెళ్ళేను.

ఈసారి- ఆ ఇంట్లో- ఒక్కడే అబ్బాయి వున్నాడు.

వాడు, ఇదివరకు ఇద్దర్లో ఎవడూ కాడు.

మరోడూ. చాపమీద బోర్లగిలాపడుకునీ వున్నాడు.

తలుపులు వారగా వేసివున్నాయ్! గడియ లేదు.

ఆ అబ్బాయి మీంచీ తాగుడు వాసనొస్తోంటే, మావయ్య వెర్రాడిలా నన్ను చూసేడు. గభాల్న వెళ్ళి వాడి వీప్మీదోటి చరిచీ లేపేడు ఆయన.

తాగీ మత్తుగా పడుకున్నవాడు అంత తొరగా మాకు జవాబు చెప్పలేకపోయేడు. ఇన్ని నీళ్ళు ముఖాన చల్లగా "శ్రీనా? కావాలా? జయంతితో వెళ్ళేడు" అని చెప్పేడు.

"ఎవరూ?" మావయ్య నిర్ఘాంతపోతూ అడిగేడు.

◆◆◆◆

**తాగి మత్తుగా పడుకున్నవాడు, అంత తొరగా మాకు జవాబు చెప్పలేకపోయాడు.**

◆◆◆◆

"జయంతా? అదెవరు? ఆడా? మగా?"

ఆ కుర్రాడు ఫకాల్న నవ్వేడు.

"జయంతి మగేటండీ? అమ్మాయి!"

"అమ్మాయా? హోరి వెధవా?" అని తిట్టీ-

"ఇంటిపేరూ?" అడిగేడు, మావయ్య.

"రెండు జడల అండీ!"

"బాబూ! నేన్నీకంటే పెద్దవాణ్ణి! నాతో హాస్యాలాడకు."

"అయ్యో! అసలు ఇంటిపేరు తెలవదండీ! అందరూ మాత్రం ఆ పిల్లని ఆర్.జీ. జయంతీ అంటే, రెండు జడల జయంతంటారండీ!"

"ఎక్కడ? కాలేజీలో పిలుస్తారా, అలా? శ్రీను కాలేజీ కసలే వెళ్ళడేమో? మరి జయంతితో పరిచయం ఎలా అయింది?"

ఆ అబ్బాయి పరిహాసంగా నవ్వేడు.

"ఎంతసేపు, సార్? చొరవవుండాలి! స్పీడ్ వుండాలి! ఎట్రాక్ట్ అవాల! అవుంటే వన్‌డే ఒన్లీ చాల్సార్! అమ్మాయితో...! శ్రీను ఓవరుస్పీడు. ఆళ్ళిద్దరూ కాలేజీకెళ్ళేది తక్కువ! సినిమాలకీ, షికార్లకీ పోయేది ఎక్కువ! ఇంతకీ మీరెవర్సార్?" అనడిగేడు ఆ అబ్బాయి అనుమానంగా.

"అతను శ్రీను బావ! నేను శ్రీను ఫాదర్ని!" అంతే!

ఆ అబ్బాయి "ఓర్నాయినోయ్!" అని కేకవేసీ, లోపలికి పారిపోయేడు. మావయ్య శ్రీనుగదంతా సోదా చేయసాగాడు.

నేను లోపలికెళ్ళాను.

ఆ గది వెనకాల చిన్న పెరడుంది. లెట్రినూ, బాత్రూం వున్నాయి.

శ్రీను హోటల్లో తింటూ, వుంటున్నాడిక్కడ.

ఆ ఇంటికి, పెరట్లోంచి ఒక చిన్న ద్వారం వుంది. అవతలవయిపు అంతా రాళ్ళూ రప్పలూ, డొంకలు కనిపించేయి. ఆ కుర్రాడు ఆ తోవెంట పారిపోయేడన్నమాట.

నిట్టూర్చి, ఇంట్లోకి ఒచ్చేను.

మావయ్య ఒక పుస్తకం, ఒక కాయితం చూపించీ "ఈ వెధవ షోకులు చూడు!" అన్నాడు.

ఆ పుస్తకం, శ్రీను నోట్సు! అందులోంచీ ఆ కాయితం బైట పడింది.

కాయితం మీదిలా రాసీ వుంది.

"డియర్ శ్రీనూ! మై లవ్! మై స్వీట్! మై హనీ! రేపు సంగమ్ థియేటర్‌కి! రెండు గంటలకి...- నీ జయంతి."

పది రోజుల క్రితం తారీఖు వేసీ వుందా కాయితం మీద.

మా వంశంలో, ఇంతదాకా ఎవరూ ప్రేమ అనే మాటని కూడా పలకడం నేను వినేదంటే నమ్మండి. అందరివీ రొటీన్ లైఫ్‌లే. ఏదో చదివేయడం ఏదో వుద్యోగం సంపాదించీ, చేసేయడం! ఏ మధ్యవర్తో కుదిర్చిన పిల్లని పెళ్ళాడేయడం. సంసారం బంధం బలమైన తాడు గదా! దాన్ని తెంపలేరెవరూ, అంత సుళువుగా! మొగుడికి పెళ్ళం మీద ప్రేముంటే, అది మనసులో వుంటుంది. ప్రేమ సినిమాకి తీసుకెళ్తుంది. చీరలు కొంటుంది. ఇంకా డబ్బుంటే గాజులో, గొలుసో కొంటుంది. పెళ్ళానికి ప్రేముంటే దగ్గరికొచ్చి ఇంట్లోవీ, వీధిలోవీ, అడ్డమైన కబుర్లూ సోది చెప్తుంది. మొగుడికిష్టవయిన వంటలు చేసిపెడ్తుంది. బస్!

కొడుకుని దగ్గరికి లాక్కునీ "వెధవవన్నీ మా నాన్న పోలికలే! అంటాడు మొగుడు

**"సెక్సూ, లవ్వూ, డ్యూయెట్లూ, రెండర్థాల డైలాగులూ... మా టీ.వీ. అమ్మేశాం!"**

ప్రేమగా.

"అదేంకాదు! వాడివన్నీ మా అమ్మ పోలికలే!" అంటుంది పెళ్ళాం ప్రేమతో! అదండీ మా ఫామిలీలో ప్రేమ.

"పెళ్లికి ముందు ప్రేమేవిటి? వాడి పిండాకూడు! నేనర్జెంటుగా జయంతిని కలవాలి." అని మావయ్య రంకెలేస్తోంటే-

మావయ్య మాట పూర్తవనేలేదు.

శ్రీను బావ రివ్వున ఒచ్చేడింట్లోకి.

నా ముప్ఫయ్యేళ్ళూ, మావయ్య ఏభయ్ నాలుగేళ్ళూ, ఒకే రకంగా, నోళ్ళు తెరిచేసేయి, బార్లా. శ్రీను పూర్వంలా లేకపోవడమే, మా ఆశ్చర్యానిక్కారణం. వాడు, వాళ్ళ నాన్న కొన్న షర్టు, పాంటూ వేస్కోలేదు. ముందర, ఆ విషయం గురించి చెలరేగిపోయేడు, మావయ్య.

"ఏవిటీ డ్రెస్సు? ఇవి, నేను కొన్నవి కావు. ఎక్కడివి?" అని వురిమేడు.

ఆ అధికారంలో, ఎంతో మమకారం వున్నాదినుమండీ!

కొడుకు, చిన్నప్పుడెలా అయితే. తను పెట్టిన తిండేతినీ, తను ఇచ్చిన బట్టలే కట్టుకున్నాడో, వాడు పెద్దయినా, ఇప్పుడూ అలాగే తనెదట వుండాలనీ ఆ తండ్రి తలంపు.

"నేన్నీకు ఫీజులకి, పుస్తకాలకిచ్చిన డబ్బులు పెట్టీ, నువ్వు నీ ఇష్టం ఒచ్చిన వేషాలేస్తున్నావేంరా?"

"నాన్నా! ఈ డ్రెస్సు జయంతి కొన్నది!" చెప్పేడు శ్రీను.

"అదేవిటి? అది కొండం ఏవిటి? అనలెవరది?"

"అమ్మాయిని 'అది' అనకు. నాన్నా జయంతి అన్ని విధాలా మనకంటే గొప్పది."

"ఛంపేస్తాను! జయంతి జయంతనీ జపం చేస్తున్నావేవిటి? ఇవాళ జయంతి! రేపు వాంతి! ఎల్లుండి నీ బతుకంతా భ్రాంతి!" కోపంలో కవిత్వం, ప్రాస ఒచ్చేస్తున్నాయ్ మావయ్యకి.

"దాన్ని నా ఎదుట పెట్టు!" అని ఆయన గర్జించేడు.

శ్రీనుకి, వాళ్ళ నాన్న కోపం తెల్సు.

"జయంతిని తీసుకొస్తాగానీ... నీ దగ్గర పిస్తోలుందేమో? నువు పిస్తోలు తీసుకువస్తే నేను జయంతిని తీసుకురాను!" అని తెగేసి చెప్పేసేడు వాడు.

"వెధవాయ్! వెళ్ళి పట్రావోయ్!"

శ్రీను నా దగ్గరికొచ్చి, "బావా! నాన్న దగ్గర..." అని గొణిగేడు.

నేను పిస్తోలేం లేదని చెపితేగానీ, శ్రీను అడుగు కూడా కదవలేదు.

జయంతి ఒస్తూనే, మావయ్య కాళ్ళకి నమస్కారం పెట్టేసింది.

ఈ వినయాన్ని మావయ్యా, నేను కూడా నమ్మలేకపోయేము.

"మీ నాన్నెవరు?" మావయ్య ప్రశ్న!

"నాన్నలేడండీ" జయంతి జవాబు.

"అందుకేనా, ఇలా పురివిప్పి ఆడుతున్నావ్?"

జయంతి నింపాదిగ తలెత్తి చూసింది మావయ్యని. నోరు విప్పలేదు.

"మీ అమ్మగారున్నారా?"

"లేరండీ!"

"అదేవిటీ? ఎవర్ని అడిగితే, వాళ్ళే లేరంటావేవిటి? పెంకితనవా? నిజంగా లేరా?"

"మీరు పెద్దవారు! మీ దగ్గర నేను అబద్ధాలెందుకాడతానండీ?"

"ఓహో? అయితే... శ్రీను నాకంటే చిన్నవాడు కనక, వాడి దగ్గర అబద్ధాలాడతావన్నమాట?"

"నాన్నా! జయంతి చాలా మంచిది!"

"నువ్ నోర్ముయ్! నీ అభిప్రాయం అడగలేదు నేను! చూడమ్మాయ్! నాన్నా, అమ్మా లేకుండా, మరెవరున్నారు నీకు. పెంచీ, పోషించే పెద్దవాళ్ళు?"

"మా బాబాయిగారున్నారండి! వాళ్ళ పిల్లల్తోనే నన్నూ పెంచేరండీ! మానాన్నకి చాలా ఆస్థి భూముల రూపంలో వున్నాదండీ! మా బాబాయి నాకు దేవుడితో సమానవండీ!"

"మీ బాబాయంటే నీకు భయం, భక్తీ లేవన్నమాట?"

"ఎందుకు లేవండీ?"

"వుండే, ఇలా శ్రీనుతో కల్సి జల్సాలు చేస్తావా?"

"నాన్నా! జయంతికి నేనంటే, చ్చాలా యిష్టం!"

"నువ్ నోర్మూయ్! నేను జయంతినడుగుతున్నాను." అంటే, జయంతికి నవ్వొచ్చి, ఆపుకుంది.

ఆ తరవాత, అందరవూ పోలోమని, జయంతి వాళ్ళ బాబాయి యింటికెళ్ళిపోయేం.

బాబాయిగారు మొదట జయంతితో మాట్లాడీ, తరవాత, మావయ్యతో మాట్లాడేడు.

"పిల్లల్ని పెంచే విధానం ఇదేనా?" మావయ్య అడిగేడాయన్ని.

"నేను, నా ఇద్దరు కూతుళ్ళనీ ఎలా పెంచేనో, మా అన్నయ్య కూతురు జయంతినీ అలాగే పెంచేను. జయంతి కాలేజీలో చేరేక, శ్రీనుని ప్రేమించింది. నా కూతుళ్ళు కాలేజీలో చేరకముసుపే ఇద్దరబ్బాయిల్ని లవ్‌చేసీ, పెళ్ళిళ్ళు చేసేసుకున్నారు. అల్లుళ్ళు మంచి వాళ్ళు అవడం, మా అదృష్టం. నేనిలా చెబితే, నేనేదో మా పిల్లలకి స్వేచ్ఛ, స్వతంత్రం ఇచ్చేసేననీ, తద్వారా వాళ్ళు చెలరేగిపోయేరనీ అనుకోవద్దు సార్! నేనూ మీలాగే పెంచేను. మీరు మీ అబ్బాయిని భయభక్తులతో పెంచలేదా? అతను కాలేజీలో చేరేక, విజృంభించలేదా?" అనీ, వూరుకున్నాడు బాబాయ్‌గారు!

అంతకంటే ఇంక వివరించలేదాయన.

మావయ్య ఏం యుద్ధం ఆడతాడో? కొడుకునేం చేస్తాడో? అని నేనూ, మావాళ్ళూ భయపడ్డాం. కాని-

చల్లగా, చక్కగా, ఆ మరుసటి నెలలోనే మంచి ముహూర్తం చూసీ, శ్రీనుకీ, జయంతికీ పెళ్ళి చేసేశాడాయన. ఏ మనిషెప్పుడెలా మారతాడో చెప్పలేం.

శ్రీను కాలేజీ చదువలా ముగిసింది.

"వివాహ విద్యనాశాయః" అయింది.

శ్రీను చేత, ఇటు మావయ్యా, అటు జయంతీ, ఓ బట్టల దుకాణం పెట్టించీ, కూచోపెట్టేరు.

★ ★ ★

'చాలా కాలం అయింది గదా, శ్రీనుగాడిన్చూసి' అనుకుని, ఆరోజు ఎలాగో, ఆఫీను, ఇల్లూ భవబంధాలు ఒదుల్చుకొని, శ్రీనింటికి వెళ్ళేను.

"జయంతీనివాస్" అనే అక్షరాలతో, చక్కటి మేడ, భార్య పేరనే కొన్నాడు శ్రీను. మేడమీద శ్రీను, భార్యా, పిల్లలు వుంటున్నారు. కింద పోర్షను అద్దెకిచ్చేరు.

శ్రీను కూతురికిప్పుడు ఎనిమిదేళ్ళు. కొడుక్కి ఆరేళ్ళు.

"ఈ వెధవల చదువులు కావుగానీ, మేం ఛస్తున్నావనుకో!" అన్నాడు శ్రీను విచారంతో.



## 'డింపుల్' వెనుక వ్యక్తి

'డింపుల్ కపాడియా' కళాత్మక చిత్రాలు ద్వారా మంచి ఆదాయాన్ని సంపాదిస్తోంది. అసలు ఆ చిత్రాలు నిర్మించేందుకు అంత డబ్బు ఎక్కడిదీ అని అనుమానమొస్తుంది కదూ! ఆమెకు ఆ సహకారాన్ని అందిస్తున్న వ్యక్తి 'రాజేష్‌ఖన్నా' మాత్రం కాదు. మరీ .... కరక్టే! ఆమె చిత్రాలన్నింటికి అనధికార నిర్మాత 'సన్నీడియోల్ '! ప్రేమంటే అదేగా మరి!

"ఏవయింది?" అడిగేను.

"గట్టిగా మేం ఓ టీవీ పెట్టుకునేందుకు వీల్లేదు. ఓ సినీమా హాలుకి వెళ్ళడానికి లేదు గదా! వాళ్ళ హోమ్‌వర్కు చేయాలి. వాళ్ళ పుస్తకాలికట్టలు వేయాలి. వాళ్ళతో కూచునీ, వాళ్ళ చదువంతా మేం చదవాలి. లేకపోతే వాళ్ళూ చదవరు. సందు దొరికితే, షామ్ కనెక్షనట. టీవీ ఛానెల్ తిప్పేస్తారు. ఆ కనెక్షన్లో పక్కవాళ్ళ టీవీలో ఏ సినీమా ఒస్తే అది మా టీవీలో ఒచ్చేస్తోంది. కళ్ళు పోతాయర్రా అంటే వినరు."చదువుపోతుందిరా అంటే వినరు. స్టార్‌టీవీ తాలూకు ఇంగ్లీషు ప్రోగ్రామ్సు కూడా వచ్చేస్తున్నాయి. మొన్నటి రాత్రి మేమందరం పడుకున్నా, మా పండుగాడు పడుకోకుండా స్టార్ టీవీది బ్లూ ఫిల్మ్ ఏదో కళ్ళింతలు చేసుకుని చూసేస్తున్నాడనుకో. నళినీ నిద్రోతున్నట్టే నటిస్తూ చిన్న కన్ను విప్పి, మూసీ , విప్పి అదీ చూసేస్తోందనుకో. ఆయింతా, నాకూ, జయంతికీ ఒళ్ళు చచ్చిపోయిందనుకో. అమాంతం వెళ్ళిటీవీ ప్లగ్ పీకేసీ ఇద్దరు వెధవల్ని నాలుగు బాదీ పడుకున్నాం."

"అయితే వాళ్ళు మీకంటే ఎడ్వాన్స్ అన్నమాట."

అన్నాను నవ్వుతూ.

"ఏవన్నావ్? అడ్వాన్స్ అనా?" అన్నాడు శ్రీను.

నా మాటకి వాడి ముఖం, జయంతి ముఖం ఎర్రెర్రగా తయారయ్యేయి.

"మేం బరితెగించిపోతే, మా పిల్లలు మాకంటే బరితెగించిపోయేరు అనీ నువ్వు అంటున్నావా?" అన్నాడు శ్రీను వుడికిపోతూ.

"మా పోలికలే మా పిల్లలివీ అనీ ఇన్‌డైరెక్ట్‌గా చెప్తున్నావా?"

నేనేం పలకలేదు.

"నువ్వు మీ నాన్నని బాధపెట్టేవు. నిన్ను నీ పిల్లలు బాధపెడ్తున్నారు" అనేసేను. ఆ తరువాత ఒకప్పుడు వాడు నన్నెంత ట్రబుల్ చేసేడో గుర్తొచ్చి.

"సెక్సూ, లవ్వూ, డ్యూయెట్లూ, ఫైటింగులూ, బ్రేకు డేన్సులూ, బాత్రూమ్ పాటలూ ఇవన్నీ ఆ వెధవల బుర్రల్ని పట్టిపోతున్నాయ్‌రా! రెండర్థాల డైలాగులు ప్రయోగిస్తున్నారు వాళ్ళు. మా టీవీ అమ్మేసేం. అయినా సరే పక్కవాళ్ళ టీవీకి పారిపోయీ, ఆ అడ్డవయినవీ అవుపాశన పట్టేస్తున్నారు! వాళ్ళనెలా మార్చాలో, ఎలా చదివించాలో తోచకా, మా బుర్రలు బద్దలుకొట్టుకునీ ఛస్తున్నావనుకో!" అంటూ వాపోయాడు శ్రీను.

వాడి కొడుకు రివ్వునొచ్చి నన్ను చూసి, పారిపోబోతుంటే పట్టుకున్నాను."స్టార్ టీవీలో ఏం ఒచ్చేయి బాబూ ఈ రోజూ?" అడిగేను. వాడు చురుగ్గా చూసేడు. వాడికి నా మాట తాలూకు వ్యంగ్యం బోధపడిపోయింది.

"మీ పిల్లలు కూడా ఇదే వద్ధతా?" శ్రీనడిగేడు.

"వాళ్ళిద్దర్నీ వాళ్ళమ్మమ్మగారింట్లో పెట్టేసేం! వాళ్ళింటి పక్కనే ఓ గవర్నమెంటు బడి వుందిలే! కాన్వెంటు కాదు. మేం పాలకోసం పరిగెత్తడం లేదు. మాకు నీళ్ళు చాలు. వాటి కోసం నడుస్తాం. ఇంగ్లీషు బళ్ళల్లో, ఇంతంత పుస్తకాల్తో చావగొట్టీ చెవులు మూసే పనిష్మెంట్లతో, వేల రూపాయల క్షవరంతో, మేం వృధాప్రయాస పట్టం లేదు. ఆ బస్తాడు బాధ నించీ రిలీఫ్ కోసం వాళ్ళు ఈ స్టార్ టీవీల్ని ఆశ్రయిస్తున్నారనీ, మీరు గ్రహించుకోవడంలేదా?" అన్నాను నేను. ఆ రాత్రే నేనొకలని కన్నాను. కలలో నా లెక్చెరుకి, మా బావ శ్రీను ఆఆంజనేయుళ్ళ మూతిపెట్టుకున్నాడా మాటలికి.

"స్టారు టీవీలన్నీ ఎత్తేయాలీ!" అని ఓ అట్టమీద రాసీ, అది పట్టకునీ, తిరిగేడు శ్రీను. అన్నిళ్ళవాళ్ళకీ చూపించేడు. అందరికీ స్టారు టీవీ నష్టాలు గురించీ వివరించేడు.

అబ్బే! వాడి కష్టం ఒక్కపినరు కూడా ఫలించలేదు.

ఇళ్ళ వాళ్ళంతా శ్రీనుని పిచ్చాడిన్చూసి నట్టూ చూసేరు.

"రోజంతా చాకీరితోనీ, సమస్యలతోనే మేం చావాలా? మా బతుక్కి ఏదైనా ఆనందం వుండొద్దా?" అన్నారిళ్ళవాళ్ళు!

"మీ పిల్లలు బాగుపడ్డం మీకిష్టం లేదా?" అనడిగేడు శ్రీను.

"ఎప్పుడో వాళ్ళు మమ్మల్ని వుద్ధరిస్తారనీ, ఇప్పట్నించీ మమ్మల్ని సన్యాసం పుచ్చుకోమంటావీవిటయ్యా? యింతకీ నువ్వేవిటి, మీ నాన్ననుదరించేవు? ఆయన చెప్పిన మాట ఏం విన్నావు?"

ఆ అదలింపుతో శ్రీనుకీ, నాకూ కూడా బుర్ర గిర్రున తిరిగిపోయింది.

టక్కున తెలివొచ్చేసింది నాకు! అయితే ఇదంతా కలా? అని ఆశ్చర్యపోయేను.

నా కలని శ్రీనుకీ, మావయ్యకీ చెప్పేను.

మావయ్య కొడుకుతో, "నేను చెప్పిన మాట నువ్వినలేదు! నువ్వు చెప్పిన మాట నీ పిల్లలు ఎందుకు వినాలి?" అని అన్నాడావేశంతో.

నేను అందర్నీ సర్దడానికి ట్రయ్ చేశాను.

"ఎవరూ ఏవీ వర్రీ అవకండి! నిన్న వున్నవి ఇవాళ లేవు! అలాగే, ఇవాళ వున్నవి రేపు వుండవు! ఈ స్టార్లూ అవీను!" అని చెప్పేను.

మా మావయ్య మాత్రం ఇంకా కొడుకుమీద కోపాన్ని పోగొట్టుకోలేక మనవల్ని వెనకేసుకొస్తూనే వున్నాడు.